(బుఖారీ-ముస్లిం)

# సమాధిలో శిక్ష ఆత్మకా లేక శరీరానికా?

సమాధిలో లభించే శిక్షాబహుమానాల గురించి చదివినప్పుడు "సమాధిలో శిక్ష లేక బహుమానాలు లభించేది ఆత్మకా లేక శరీరానికా లేక రెండిటికా? "అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

పండితులు ఈ విషయంపైన సుదీర్ఘమైన చర్చలు జరిపారు. కొందరు శరీరాన్ని కొంతకాలం తర్వాత మట్టి తినేస్తుంది. మరేమో బహుమానం లేక శిక్ష అనేది ప్రళయం వరకూ మిగులుంటుంది కనుక ఈ శిక్ష లేక బహుమానం అనేది ఆత్మకే లభిస్తుంది అని అభిప్రాయపడ్డారు. సమాధిలోకంలో శిక్ష లేక బహుమానం అనేది సమాధికి సంబంధించినది. విశ్వాసి కొరకు సమాధి విశాలమవుతుంది. అందులో వెలుతురు ఉంటుంది. అవిశ్వాసిపైకి సర్పాలు సమాధిలోనే వదలబడతాయి. సమాధిగోడలు మాటిమాటికీ శవాన్ని ఒత్తుతూ ఉంటాయి. సమాధిలో కేవలం శరీరం మాత్రమే ఉంటుంది. కనుక శరీరంలోని ఒక్క అణువు మిగిలి ఉన్నా సమాధి శిక్ష లేక బహుమానం దానికే కలుగుతుందని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఇంకొందరి అభిప్రాయం ప్రకారం ఆత్మ మరియు శరీరం వేర్వేరుగా ఉన్నా వాటి మధ్య అగోచరమైన సంబంధం ఉంటుంది కనుక శిక్షాబహుమానాలు ఆ రెండిటికి కలుగుతాయి.

మా దృష్టిలో ఈ విషయం కూడా ఆకోవకు చెందినదే. అంటే దీనిని విశ్వసించటం విధి. అయితే దాని స్థితి గురించి మాత్రం మనకు తెలియదు. అల్లాహ్‌కు పూర్తి అధికారం ఉంది. ఆయన తలచుకుంటే కుళ్లి కృశించి మట్టిలో కలిసిపోయిన శరీరానికి లేక ఆత్మకు లేక రెండిటికీ శిక్షాబహుమానాలు ఇవ్వగలడు. మా దృష్టిలో ఇది ఫలితం లేని వృధా చర్చ. అందులో పడి మేము మా సమయాన్ని ,పాఠక మహాశయుల సమయాన్ని వృధా చేయదలచుకోలేదు. ఈ చర్చకు మన సన్మార్గంతో ఏ మాత్రం సంబంధం ఉండి ఉన్నా దైవప్రవక్త (సల్లం) దాన్ని తప్పకుండా వివరించి ఉండేవారు. కనుక మనం దైవప్రవక్త (సల్లం) చెప్పిన మాటతోనే సంతృప్తి చెందాలి. ఆ మాట ఏమిటంటే సమాధి శిక్ష తథ్యం. దాన్నుంచి శరణు వేడుకోండి.

هٰذَا مَا عِنْدِيْ وَ الْعِلْمُ عِنْدَ اللهِ وَ هُوَ بِكُلِّ شَيْءٍ عَلِيْمٌ وَ صَلَّى اللهُ عَلٰى نَبِيِّنَا مُحَمَّدٍ وَ آلِهٖ وَ صَحْبِهٖ اَجْمَعِيْنَ